గడప వద్దకే వైద్య సేవలు

- జగనన్న పంపిన దైవదూతలు ఎంఎల్‌హెచ్‌పీలు
- అడగకుండానే సమస్యలు పరిష్కరిస్తున్న సీఎం జగన్
- జన్మజన్మకూ జగనన్నకు రుణపడి ఉంటామంటూ దీవెనలు

మోపిదేవి: వృద్ధాప్యంలో సొంత బిడ్డలే పట్టించుకోని ఈ రోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ బిడ్డగా, మనవడిగా సొంత ఇంటి వాడై ఆదుకుంటున్నారు. అన్ని పథకాలను ప్రజలకు చేరువ చేరుస్తున్న సీఎం జగన్ వైద్యాన్ని కూడా గడప వద్దకే అందిస్తున్నారు. జబ్బుల బారిన పడిన పేద వారు, వృద్ధాప్యంలో పట్టణాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేని వారు, నడవలేని వారికి నేనున్నానంటూ ముఖ్యమంత్రి అండగా నిలిచి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రవేశపెట్టారు. దీని ద్వారా వైద్యులు వారి గడప వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యం పొందిన వృద్ధులు సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిదని, జన్మజన్మలకు రుణపడి ఉంటామని, ఆయన చల్లగా జీవించాలని నిండు మనస్సుతో దీవిస్తున్నారు.

రోగులకు అందుబాటులోకి హెల్త్ క్లినిక్‌లు

మండలంలోని రెండు పీహెచ్‌సీ కేంద్రాలు మోపిదేవి, పెదకళ్లేపల్లి పరిధిలో 10 సబ్ సెంటర్ల కింద వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభించారు. ప్రతి క్లినిక్‌లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ను నియమించారు. వీరు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ బీపీ, షుగర్, క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్నారు. చెవి, ముక్కు, గొంతు, కళ్లు, టీబీ, లెప్రసీ వంటి వ్యాధులను గుర్తించి పీహెచ్‌సీ, సంబంధిత స్పెషలిస్టులకు సిఫారసు చేస్తారు. ఆరోగ్య శ్రీలో ఆపరేషన్ చేయించుకున్న రోగులను తరచూ వారి ఇంటి వద్దనే కలిసి ఆరోగ్య విషయాలు తెలుసుకుంటారు. గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలకు హాజరవుతూ బాల్య వివాహాలు, హెల్త్ ఎడ్యుకేషన్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శించి పిల్లల మానసిక వికాసం పెంపొందించేందుకు పాటలు పాడించడం ఎత్తు, బరువును గుర్తించడం వంటివి చేస్తున్నారు. 10–19 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆడపిల్లలకు రక్తహీనతను పరిశీలించి అవసరమైతే ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ ఇస్తున్నారు. హ్యాండ్ వాషింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. పీహెచ్‌సీలోని వైద్యులు కూడా నెలలో రెండు సార్లు ఒక గ్రామంలో పర్యటిస్తూ రోగులకు అందుబాటులో ఉంటున్నారు.



వృద్ధురాలికి ఇంటి వద్ద వైద్యసేవలు అందిస్తున్న వైద్య బృందం (ఫైల్)



పెదప్రోలు అంగన్‌వాడీలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)



జగన్ దేవుడిలా ఆదుకుంటున్నారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలను దేవుడిలా ఆదుకుంటున్నారు. గతంలో దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేక పోయాం. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నీ ఇంటి వద్దకే అందిస్తున్నారు. వైద్యం కూడా ఇంటివద్దకే రావడం చాలా బాగుంది. జగన్ వంటి ముఖ్యమంత్రిని ఇప్పటివరకు ఎక్కడా చూడలేదు.

– బోగిరెడ్డి వెంకటేశ్వరరావు, కోసూరువారిపాలెం



జగనన్న మేలులు మరువలేము

చాలా మంది ముఖ్యమంత్రులు వచ్చారు కానీ ఇలాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదు. అడగకుండానే మన సమస్యలు తీరుస్తున్న జగనన్న మేలును మరువలేము. ఇంటికే వచ్చి వైద్య సేవలు అందిస్తారని ఎప్పుడూ ఊహించలేదు. వృద్ధులు, ప్రజల దీవెనలు ముఖ్యమంత్రి జగన్‌కే ఉంటాయి.

– అనురాధ, కోసూరువారిపాలెం



గ్రామాల్లోనే చాలా వైద్య సేవలు

చాలా వ్యాధులకు విలేజ్ క్లినిక్‌లోనే వైద్యం అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పేద ప్రజలకు వరంగా పని చేస్తున్నాయి. పీహెచ్‌సీకి నూతన, ఆధునిక పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. ప్రతి సచివాలయంలో నెలకు రెండు సార్లు వైద్య బృందం పర్యటించి సేవలు అందిస్తోంది.

– డాక్టర్ అనిల్‌కుమార్, మోపిదేవి పీహెచ్‌సీ

నీరు-చెట్టు పేరుతో దోచుకున్నదెవరో ప్రజలకు తెలుసు

- జగనన్న కాలనీలకు మెరక పనులు చేస్తుంటే దోపిడీ అంటారా?
- దోపిడీలు, దందాలు చేస్తున్నట్లు రుజువు చేస్తే రాజీనామా
- బుద్ధప్రసాద్‌కు ఎమ్మెల్యే సింహాద్రి సవాల్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: నాడు నీరు–చెట్టు పేరుతో దోచుకున్నదెవరో, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులు పాలు చేసిందెవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసని, అన్నీ మర్చిపోయి తనపై మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న లే అవుట్లకు మెరక పనులు చేస్తుంటే నియోజకవర్గంలో మట్టి, ఇసుక దందాలు పెరిగిపోయాయని బుద్ధప్రసాద్ విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేద ప్రజలకు శాశ్వత గృహాల ఏర్పాటుకు పనులు చేస్తుంటే టీడీపీ నేతలకు అంత కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. నీరు చెట్టు పేరుతో బుద్ధప్రసాద్ ఇంటి పక్కన చెరువుతో మొదలు కొని చల్లపల్లి నారాయణరావు నగర్, ఘంటసాలలో గతంలో మీ పార్టీ నాయకులు చేసిన మట్టి దందాను ప్రజలు మర్చిపోరన్నారు. మీ ఇంటి నిర్మాణానికి అక్రమంగా ఎడ్లంక నుంచి భారీగా ఇసుక తరలించగా పత్రికల్లో వచ్చిన వార్తలను ప్రజలు మర్చిపోలేదని చెప్పారు. రైతులకు ఉపయోగం లేకుండా కాంట్రాక్టర్‌ను బాగుచేసేలా మీ హయాంలో చేపట్టిన రూ.165 కోట్ల డెల్టా ఆధునికీకరణ పనుల్లో మీరు వెనుకేసుకున్నదెంతో ప్రజలకు చెప్పాలని బుద్ధప్రసాద్‌ను ఎమ్మెల్యే సింహాద్రి డిమాండ్ చేశారు. ఆనాడు రైతులు, తీర ప్రాంత ప్రజలకు ఉపయోగ పడే అవుట్‌పాల్ స్లూయిజ్‌లను వదిలేసి కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరేలా, మీకు ప్రయోజనం కలిగేలా కాలువలకు గోడలు కట్టించిన బుద్ధప్రసాద్ నేడు రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల ప్రయోజనం కోసం సహకారం అందిస్తున్న ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుపై విమర్శలు చేయడం తగదన్నారు. వాస్తవాలు ఉంటే రుజువు చేయాలని సవాల్ విసిరారు. పేదలకు ఉపయోగపడే పనులను అడ్డుకుంటే ఉనికి లేకుండా చేస్తారని, రాజకీయ ప్రయోజనాలతో కుట్రలు, కుతంత్రాలు మాని మంచి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే హితవు పలికారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ తోట గణేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కైలే



రైతుల సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే

చిలకలపూడి(మచిలీపట్నం): పెదపారుపూడి మండలంలోని పాములపాడు, మోపర్రు గ్రామాలకు చెందిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. కలెక్టర్ పి. రాజాబాబును ఆయన చాంబర్‌లో గురువారం కలిశారు. ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ పాములపాడు, మోపర్రు గ్రామాల్లో 120 ఎకరాల వ్యవసాయ భూములకు రెండు వైపులా ఆక్వా చెరువులు ఉన్నాయని, ప్రతి సంవత్సరం ఈ భూములు వరద ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. వరిసాగుకు అనుకూలంగా లేకపోవడంతో ఆర్థికంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 294 నుంచి 306 వరకు ఉన్న 12 సర్వే నెంబర్లలోని భూములను చేపల చెరువుగా మార్చుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖ జేడీ, పెదపారుపూడి తహసీల్దార్ ఇరువురు కలిసి క్షేత్ర పరిశీలన చేసి ఆ ప్రాంతంలోని ప్రస్తుత పరిస్థితిపై నివేదిక ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి పనికిరాని భూమిని ఆక్వా జోన్‌లో చేర్చేందుకు ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించినందుకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. పెడనలోని మంత్రి కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లతో జగనన్న సురక్షపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి అందుకోని వారిని గుర్తించి వారికి అందించడమే కాకుండా ధ్రువీకరణ పత్రాలు, పట్టదారు పాస్ పుస్తకాలు వంటి వాటిని అందించేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. శుక్రవారం నుంచి జరిగే కార్యక్రమంలో వలంటీర్లతో పాటు గృహ సారథులు పాల్గొని విజయవంతం చేయాలని చెప్పారు. ఎంపీపీలు వెలివెల చినబాబు, సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మండల, పట్టణ కన్వీనర్లు రాజబాబు, వైదాని వెంకట్రాజు, గొరిపర్తి రవికుమార్, కొండవీటి నాగబాబు, బందారు మల్లి, సమన్వయకర్తలు మతీన్, బెజవాడ నాగబాబు, సుబ్బారావు, బాబ్జీ పాల్గొన్నారు.

విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగులు

ప్రభుత్వంతోపాటు సొంతగా నగదు పురస్కారాలు అందజేసిన పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: విద్యతోనే పేదల జీవితాలు అభివృద్ధి చెందుతాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 73 మంది విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను గురువారం ఆయన అందజేశారు. స్థానిక మాచవరంలోని జి-కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో ప్రథమ స్థానాన్ని సాధించిన 25 మందికి రూ. 3 వేలు చొప్పున, ద్వితీయ స్థానంలో నిలిచిన 24 మందికి రూ. 2 వేలు, తృతీయ స్థానం సాధించిన 24 మంది రూ.వెయ్యి చొప్పున ఆయన అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఇదే కాకుండా పేర్ని కిట్టు తన సొంత డబ్బులు రూ.2.45 లక్షలను విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ప్రథమస్థానం సాధించిన వారికి రూ. 5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ. 3 వేలు, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ. 2 వేల చొప్పున రూ. 2.45 లక్షలు అందజేసి విద్యార్థులను ప్రోత్సహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాడు-నేడు పథకంతో పాటు జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, ట్యాబ్‌ల పంపిణీ తదితర కార్యక్రమాలతో విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువచ్చారని వివరించారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత, డీవైఈఓ యూవీ సుబ్బారావు, ఎంఈఓ దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు చిటికిన వెంకటేశ్వరమ్మ, యండ్రపాటి నాగేశ్వరరావు, మాచవరపు రాంప్రసాద్, వాణిశ్రీ, ముంతాజ్‌బేగం, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవోదయలో కోడూరు విద్యార్థుల ప్రతిభ



విస్సంశెట్టి దీపిక



పెదసింగు కృప



పరసబత్తిన సమంత

కోడూరు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో కోడూరు మండల విద్యార్థులు ప్రతిభ చూపి మూడు సీట్లను సాధించారు. కోడూరు మెయిన్ ఎంపీయూపీ పాఠశాలకు చెందిన పరసబత్తిన సమంత, మాచవరం ఎంపీపీ పాఠశాలకు చెందిన విస్సంశెట్టి దీపిక, పాలకాయతిప్ప ఎంపీపీ పాఠశాలకు చెందిన పెదసింగు కృప సీట్లు సాధించారని ఎంఈఓ టీవీఎం రామదాసు తెలిపారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న సుమారు 45 మంది విద్యార్థులకు మూడు నెలల పాటు నవోదయకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు సీట్లు సాధించడం హర్షణీయమన్నారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు మన్నె ప్రేమ్‌చంద్, రేపల్లె జయప్రద, సీఆర్పీలను, ఉపాధ్యాయులను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అభినందించారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

చల్లపల్లి: మురికివాడల్లోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కైతేపల్లి దాస్ కోరారు. గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన ఉన్న మురికివాడలో బడి ఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బడికి వెళ్లేందుకు రిక్షా కానీ, ఆటో కానీ ఏర్పాటు చేస్తామని, పిల్లలను చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, వలంటీర్ సీహెచ్.సురేఖ పాల్గొన్నారు.

పల్లోటి ఉన్నత పాఠశాలకు ఐసీఎస్ఈ గుర్తింపు

పెడన: పెడన పల్లోటి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలకు ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఈ) గుర్తింపు లభించిందని పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ జోజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని నెలలుగా కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీ వారితో సంప్రదింపులు జరిపామన్నారు. అనంతరం ఐసీఎస్ఈ బోర్డు ప్రతినిధులు పాఠశాలను సందర్శించి రిపోర్టు రాసుకుని వెళ్లారన్నారు. పాఠశాలకు ఐసీఎస్ఈ గుర్తింపు రావడం ఆనందంగా ఉందని చెప్పారు.

అడపా రామకోటేశ్వరరావుకు నివాళి

అవనిగడ్డ: దివంగత జెడ్పీటీసీ సభ్యుడు అడపా రామకోటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. అడపా చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అడపా పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడారని కొనియాడారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేత చీరల తయారీ పరికరాలు అందజేత

చిలకలపూడి(మచిలీపట్నం): చిన్నాపురం గ్రామంలోని బాల సరస్వతి వీవర్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు నేత చీరలకు అవసరమైన పరికరాలను గురువారం అందజేశారు. ఎమ్మెల్యే పేర్ని నాని ఆదేశాల మేరకు రూ. 25 లక్షలతో నేత చీరలకు సంబంధించిన పరికరాలను సంఘ అధ్యక్షుడు విట్టంశెట్టి వెంకు చేనేత కార్మికులకు అందజేశారు. నేత చీరల కోసం వినియోగించే జాకార్డు మిషన్లు, అచ్చులు, డాబీ మిషన్లు 90 శాతం సబ్సిడీతో 27 మంది చేనేత కార్మికులకు అందజేశారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

నిమ్మగడ్డ(చల్లపల్లి): నిరుపేద ఎస్సీ విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందిస్తూ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయినులు చేసిన కృషి ప్రశంసనీయమని ఏపీ సచివాలయ న్యాయ శాఖ డెప్యూటీ కార్యదర్శి వెలగపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డ ఎంపీపీ స్కూల్‌లో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయినులు కె.సీత, కె.మాధవిలకు గురువారం పౌర సన్మానం జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజులపాటి అంకమ్మ, పీఆర్‌టీయూ నాయకులు దేవరపల్లి సురేష్, యూటీఎఫ్ నాయకుడు కె.రవీంద్ర, సీహెచ్ కోటేశ్వరరావు, హెచ్‌ఎం సునీత కుమారి, ఏఎంసీ చైర్మన్ ప్రశాంతి పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

చిలకలపూడి(మచిలీపట్నం): అర్హత కలిగిన ప్రతి రైతు కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఏఓ హారిక అన్నారు. పెదపట్నం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన కౌలు రైతులందరూ క్రాప్ కల్టివేషన్, వైట్‌కార్డులు తీసుకోవాల్సి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గడిదేశి రాజు, వీఆర్వో గణేష్, గడిదేశి జోజిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్‌బీకే, సచివాలయం తనిఖీ

పెడన: పెనుమల్లి సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఎంపీడీఓ రెడ్డయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది మూమెంట్ రిజిస్టరు, హాజరు పట్టీలను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్షపై వలంటీర్లకు శిక్షణ ఇచ్చిందీ, లేనిదీ అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ అవుతుందన్నారు. దీనిని స్థానికులు వీక్షించేలా సచివాలయాల్లోను, ఆర్‌బీకేలలోనూ టీవీలు ఏర్పాటు చేయాలన్నారు.

కార్తికేయుని సేవలో డీపీఓ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని డీపీఓ నాగేశ్వర నాయక్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

రావివారిపాలెం(మోపిదేవి): పీహెచ్‌సీ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి స్పర్శ లేని మచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించాలని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ బి. లక్ష్మీనాథ్ అన్నారు. రావివారిపాలెం పీహెచ్‌సీలో గురువారం ఆశా, ఏఎన్ఎంలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) నిర్వహించాలన్నారు. మచ్చలు ఉన్న వారిని గుర్తించి మందులు వాడేలా బాధితులకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారి బాబూరావు, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

పెడన: స్వామిత్వ (వైఎస్సార్ శాశ్వత భూహక్కు.. భూ పత్రం పథకం)లో భాగంగా నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాల్లో ప్రభుత్వ భూములను మచిలీపట్నం డివిజినల్ పంచాయతీ అధికారి ఐ. జ్యోతిర్మయి గురువారం పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో ఇప్పటికే రీ సర్వే పూర్తయింది. గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అభ్యంతరాల స్వీకరణకు గ్రామ సభలు నిర్వహించినా ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో నివేదికలు తుది దశకు చేరాయి. ఈ నేపథ్యంలో పునఃపరిశీలన చేసి ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి.. వాటి స్థితిగతులు ఏమిటనే దానిపై డీఎల్‌పీఓ పరిశీలించారు. కార్యక్రమంలో పెడన ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈఓపీఆర్డీ ఎం. జయరాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రింగ్ పనులు వేగవంతం చేయండి

పెడన: ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సెంట్రింగ్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ఎక్కువ మందికి సెంట్రింగ్ పనులు అప్పగించేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ పి. శివరామప్రసాద్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర చాంబరులో పట్టణ, మండల ఇంజినీరింగ్ కార్యదర్శులు, హౌసింగ్, మెప్మా, వెలుగు సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు సెంట్రింగ్ పనుల వద్ద నిలిచిపోయాయన్నారు. తక్షణం సెంట్రింగ్ పనివారిని గుర్తించి ఆయా పనులు వేగవంతమయ్యేలా ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు, వెలుగు ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కృత్తివెన్ను: బాల్యంలో ఆటపాటలతో కూడిన విద్యా బోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతోందని కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యురాలు మేధున అన్నారు. మండల పరిధిలోని మాట్లాం ఎస్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మేధున మాట్లాడుతూ మూడు నుండి ఐదేళ్ల వయస్సు గల పిల్లలకు అంగన్‌వాడీలో మంచి పోషకాహారాన్ని అందజేస్తూ వారి విజ్ఞానానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఐదేళ్లు పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యకు వెళుతున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు యూనియన్ అండ

పెదప్రోలు(మోపిదేవి): పాల ఉత్పత్తిదారులకు కృష్ణా మిల్క్ యూనియన్ అండగా ఉంటుందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కప్తానుపాలెం పాల కేంద్రం వద్ద రైతుల సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు యూనియన్ అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం పాలు అధికంగా సరఫరా చేసిన రైతులను సన్మానించారు. పాల సంఘం అధ్యక్షుడు నాదెళ్ల భవానీ శంకర్ ప్రసాద్, మద్దిపట్ల సీతారామయ్య, జిల్లా పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

చిలకలపూడి(మచిలీపట్నం): బైరాగిపాలెం కొత్త కాలనీలో రోడ్డు పనులకు పట్టి తవ్వకం పనులను గురువారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చండిక అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు



డ్రెయిన్ కల్వర్టు పనులు ప్రారంభిస్తున్న కిట్టు, చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 50వ డివిజన్ గుమ్మస్తాల కాలనీలో రూ. 3.13 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా నిర్మించనున్న డ్రెయిన్, కల్వర్టు పనులకు, 45వ డివిజన్ పరిధిలోని బెల్ కంపెనీ వెనుక రోడ్డులో రూ. 6 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న డ్రెయిన్ కల్వర్టు పనులకు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు రాటాలమ్మ, వరలక్ష్మి, మాచవరపు రాంప్రసాద్, పర్ణం సతీష్, మాజీ కౌన్సిలర్ చిటికెన నాగేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కృత్తివెన్ను: ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఇరిగేషన్ డీఈఈ సూర్యభరత్, ఏఈఈ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. యండపల్లి పంచాయతీ గాంధీనగరం వద్ద బంటుమిల్లి–లక్ష్మీపురం ప్రధాన పంటకాలువపై వంతెన నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు విన్నవిస్తున్నారని సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్ తెలిపారు. వంతెన నిర్మాణంతో 2 వేల జనాభా, 3 వేల ఎకరాల ఆయకట్టులోని భూములకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పిన్నెంటి మహేష్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుప్పాల నరసింహారావు, పిన్నెంటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పెరుగు సరఫరాకు వేలం

మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానానికి పెరుగు సరఫరాకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. సంవత్సర కాలానికి వెన్న 4.5 శాతంతో పెరుగు సరఫరాకు మోపిదేవికి చెందిన విస్సంశెట్టి గుప్తా ముందుకు వచ్చారని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. దేవస్థానానికి చెందిన 600 చీరలు, 400 పంచుల వేలం వాయిదా పడిందన్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆందోళన

కోడూరు: జగనన్న లే అవుట్‌లోని గృహస్తుల అవసరాల కోసం వినియోగించేందుకు కేటాయించిన ఖాళీ స్థలంలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. కోడూరులోని స్వతంత్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించింది. ఈ లే అవుట్‌లో ఇప్పటికే 85 శాతానికి పైగా లబ్ధిదారులు తమ గృహాలను నిర్మించారు. రహదారికి అనుకొని కొంత స్థలాన్ని అధికారులు లే అవుట్‌లోని లబ్ధిదారులంతా వినియోగించుకునేందుకు ఖాళీగా వదిలిపెట్టారు. ఆ ఖాళీ స్థలంలో కొంతమంది అక్రమ నిర్మాణాలను ప్రారంభించారు. దీంతో లే అవుట్‌లోని లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం, లే అవుట్ ప్రాంతంలో నిరసన చేపట్టారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా ఆదేశాల మేరకు వీఆర్వోలు ఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణాలను నిలుపుదల చేయించారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ లబ్ధిదారులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కోడూరు–3 ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, వార్డు సభ్యుడు మెండు అర్జునరావు లబ్ధిదారులకు మద్దతు తెలిపారు.